క్లుప్తంగా

వయోపరిమితి పెంపుపై హర్షం

శ్రీరాంపూర్: సింగరేణి డిపెండెంట్‌ల వయోపరిమితి పెంపుపై హెచ్‌ఎంఎస్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్య, కార్యదర్శి అనిల్ రెడ్డిలు బుధవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. 35సంవత్సరాల నుంచి 40 సంవత్సరాలకు వయోపరిమితి పెంచడం వల్ల అనేక మంది డిపెండెంట్‌లకు లాభం జరుగనుందన్నారు. ఈ సందర్భంగా వారు సీఎండీకి కృతజ్ఞతలు తెలిపారు. చాలాకాలంగా ఈ వయోపరిమితి పెంపు కోసం అన్ని కార్మిక సంఘాలు పోరాటం చేశాయని పేర్కొన్నారు. కానీ ఇది తామే సాధించామంటూ ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నాయన్నారు. ఈ జీవోకు కారణం ఇది కార్మికుల పోరాట ఫలితమే తెలిపారు.

టెన్త్ టాపర్‌కు సన్మానం



సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

భీమారం: స్థానిక జెడ్పీ ఉన్నతపాఠశాలలో పదోతరగతి పరీక్షల్లో టాపర్‌గా నిలిచిన హెప్సీబా అనే విద్యార్థినిని బుధవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇన్‌చార్జి హెడ్మాస్టర్ వెంకటేశ్వర్‌తో పాటు ఉపాధ్యాయులు శాలువా కప్పి సన్మానించారు. కాగా విద్యార్థులకు ఈ విద్యాసంవత్సరం కోసం పాఠ్యపుస్తకాలతో పాటు దుస్తులు పంపిణీ చేశారు. ఇందులో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

19న వారసంత వేలం

జన్నారం: మండలంలోని పొనకల్ మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో నిర్వహించే వారసంత, దినసంత వేలం ఈ నెల 19న నిర్వహించనున్నట్లు ఈవో రాహుల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 19న ఉదయం 9 గంటల నుంచి 12గంటల వరకు వేలంలో పాల్గొనే వారు డిపాజిట్ చేసుకోవాలని, మధ్యాహ్నం 12గంటలకు వేలం వేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు జీపీలో సంప్రదించాలని సూచించారు.

నివాళి

మంచిర్యాలటౌన్: జమ్మూ కాశ్మీర్‌లో ఆదివారం రోజున శివఖోరీ ఆలయం నుంచి మాతా వైష్ణోదేవి మందిరానికి వెళ్తున్న 53మంది భక్తులతో వెళ్తున్న బస్సుపై ఉగ్రవాదులు చేసిన దాడుల్లో 9మంది మృతి చెందగా, కొందరు గాయపడడంతో వారికి బుధవారం రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఘన నివాళులర్పించారు. మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంకులో క్యాండిళ్లను వెలిగించి రెడ్‌క్రాస్ చైర్మన్ కంకణాల భాస్కర్‌రెడ్డి, కోశాధికారి కె.సత్యపాల్ రెడ్డి, స్టేట్ మేనేజింగ్ కమిటీ సభ్యులు వి.మధుసూదన్ రెడ్డి, జిల్లా మేనేజింగ్ కమిటీ సభ్యులు శ్రీనివాస్ నివాళులర్పించారు.

హాజీపూర్ ఎంపీడీవోగా శ్రీనివాసరెడ్డి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ ఎంపీడీవోగా మండల పంచాయతీ అధికారిగా పనిచేస్తున్న శ్రీనివాసరెడ్డి అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా బుధవారం హాజీపూర్ ఎంపీపీ కార్యాలయంలో ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించగా కార్యాలయ, ఈజీఎస్ సిబ్బంది స్వాగతిస్తూ అభినందనలు తెలిపారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీవో మధుసూధన్ వ్యక్తిగత కారణలతో దీర్ఘకాలిక సెలవులో వెళ్లగా ఎంపీవో శ్రీనివాసరెడ్డికి ఎంపీడీవోగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

అర్చనకు ఆర్థిక చేయూత



ఆర్థిక చేయూత అందిస్తున్న కలెక్టర్, డీఈవో

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలోని ముల్కల్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని అర్చన ఇటీవల 10వ తరగతి ఫలితాల్లో 10 జీపీఏ సాధించినందుకు గాను బుధవారం జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోశ్, డీఈవో యాదయ్య చేతుల మీదుగా స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకుడు నాయిరిని సురేందర్ ప్రకటిచిన రూ.10వేల ఆర్థిక సహకారాన్ని అందజేశారు.

'నిబంధనలకు విరుద్ధంగా భవన నిర్మాణం'

చెన్నూర్: పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయం పక్కన డబుల్ ఫ్లోర్ భవన నిర్మాణం కోసం అనుమతి తీసుకొని, నాలుగు ఫ్లోర్లు నిర్మించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానిక మున్సిపల్ కమిషనర్ గంగధర్‌కు ఫిర్యాదు చేసినట్లు బీజేపీ నాయకులు కొరకొప్పుల వంశీగౌడ్ తెలిపారు. ఇంటి నిర్మాణం కోసం అనుమతి తీసుకొని షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి అనుమతి నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భవనం యాజమాని పై చర్యలు తీసుకోవాలని కోరారు.



నెన్నెల: యూనిఫాం పంపిణీ తర్వాత విద్యార్థులతో ఉపాధ్యాయులు



తాండూర్: పుస్తకాలు, యూనిఫాం అందజేస్తూ...



దేవాపూర్‌లో విద్యార్థులకు యూనిఫాంలు, పుస్తకాలు అందిస్తూ...

మోగిన బడిగంట

- తెరుచుకున్న పాఠశాలలు
- బడిబాట పట్టిన విద్యార్థులు



దండేపల్లి: వెల్గనూర్‌లో విద్యార్థులకు పూలతో స్వాగతం

దండేపల్లి: వేసవి సెలవులు ముగియడంతో బుధవారం పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. సెలవుల్లో ఆటల్లో మునిగితేలిన విద్యార్థులు ఆటలకు సెలవుపెట్టి బడిబాట పట్టారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు పూలతో స్వాగతం పలికారు. పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందజేశారు. దండేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎంపీపీ శ్రీనివాస్, జెడ్పీటీసీ నాగరాణి, ఆయా పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీల చైర్మన్లు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

'ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య'

తాండూర్: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యాబోధన జరుగుతోందని ఎంపీటీసీలు సూరం రవీందర్ రెడ్డి, సిరంగి శంకర్, యశోద, మండల విద్యాధికారి ప్రభాకర్ అన్నారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని మామిడి తోరణాలతో అలంకరించి విద్యార్థులకు స్వాగతం పలికారు. పదో తరగతిలో టాపర్స్‌గా నిలిచిన విద్యార్థులను సన్మానించారు. మండలంలోని మాదారం టౌన్‌షిప్, పోచంపల్లి, ఎంవీకే త్రీ పాఠశాలల్లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌లు అందజేశారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేక అధికారి సుమన, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నస్పూర్: పట్టణ పరిధిలోని తీగల్‌పహాడ్ జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, స్కూల్ యూనిఫామ్స్ స్థానిక కౌన్సిలర్ రేగుంట చంద్రశేఖర్ చేతుల మీదుగా అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు రామన్న, రిటైర్డ్ పీజీహెచ్‌ఎం నర్సయ్య, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థుల తల్లిందండ్రులు పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్లో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, స్కూల్ ప్రిన్సిపాల్ జయకృష్ణా రెడ్డితో కలిసి విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాం పంపిణీ చేశారు.

కాసిపేట: దేవాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో ఎంపీపీ రొడ్డ లక్ష్మి హాజరై విద్యార్థులకు యూనిఫాంలు, పుస్తకాలు అందించారు. గత సంవత్సరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సన్మానించారు. ముత్యంపల్లి జిల్లాపరిషత్ పాఠశాలలో తహసీల్దార్ భోజన్న, ఎంపీడీవో సత్యనారాయణసింగ్ పాల్గొని పుస్తకాలు, యూనిఫాంలు అందించారు. కార్యక్రమంలో జిల్లాపరిషత్ పాఠశాలల హెచ్‌ఎంలు రమేశ్ రాథోడ్, సాంబమూర్తి, సుధాకర్ నాయక్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ అందె నాగమల్లయ్య, పంచాయతీ కార్యదర్శులు, వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు, అమ్మ ఆదర్శ కమిటీల సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులున్నారు.

కోటపల్లి: పాఠశాల ప్రారంభమై మొదటిరోజు కావడంతో కోటపల్లి ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం అంజన్‌కుమార్ బైక్‌పై ఇంటింటికీ వెళ్లి పిల్లలను తల్లిదండ్రులతో మాట్లాడి తనబైక్‌పై విద్యార్థులను పాఠశాలకు తీసుకొచ్చారు. అనంతరం పుష్పగుచ్ఛాలు ఇస్తూ పాఠశాలకు విద్యార్థులను ఆహ్వానించారు. బమన్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో పాఠశాల ప్రారంభం పండగ వాతావరణంలో విద్యార్థులకు మంగళహారతి, అక్షింతలతో ఆశీర్వదిస్తూ తల్లిదండ్రులతో హెచ్‌ఎం బుచ్చన్న ఆహ్వానించారు. కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో ఎస్‌వో హరిత ఆధ్వర్యంలో విద్యార్థులకు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు.

నెన్నెల/భీమిని/బెల్లంపల్లిరూరల్: భీమిని, కన్నెపల్లి, నెన్నెల మండలాల్లో పాఠశాలలు తెరుచుకున్నాయి. దీంతో పాఠశాలలకు వచ్చే విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. విద్యార్థులకు ఉపాధ్యాయులు ఘనంగా స్వాగతం పలికారు. విద్యార్థులకు నోట్ పుస్తకాలు, యూనిఫాంలను అందజేశారు. విద్యార్థులకు ప్రభుత్వం పంపిణీ చేసిన పుస్తకాలు, యూనిఫాంలను భీమిని ఎంపీపీ రాజేశ్వరి అందజేశారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి దండనాయకుల ప్రకాష్‌రావు, కో ఆప్షన్ సభ్యు డు ఇబ్రహీం, గొల్లపల్లి ఎంపీటీసీ హరీష్‌గౌడ్, నాయకులు శ్రీనివాస్, ఉపాధ్యాయులు, బెల్లంపల్లిలో మండల విద్యాధికారి పి.మహేశ్వర్ రెడ్డి, ఉపాధ్యాయులు విజయ, డాకయ్య, చాంద్‌పాషా పాల్గొన్నారు.



బెల్లంపల్లిరూరల్: యూనిఫాం అందజేస్తూ...



కోటపల్లి: నోట్‌బుక్స్ అందజేస్తున్న ఎస్‌వో



నస్పూర్: విద్యార్థులకు బుక్స్ అందజేస్తూ...



కోటపల్లి: మంగళహారతులతో విద్యార్థులను ఆహ్వానిస్తున్న హెచ్‌ఎం బుచ్చన్న, తల్లిదండ్రులు



మందమర్రిరూరల్: పుస్తకాలు పంపిణీ చేస్తూ...

'తొలిరోజు హాజరు అంతంత మాత్రమే'



సీవోఈలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఈవో, ప్రిన్సిపాల్

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల రాక అంతంత మాత్రంగానే కనిపించింది. మెజార్టీ సంఖ్యలో విద్యార్థులు ఇళ్లకు పరిమితం అయ్యారు. తొలిరోజు ఆశించిన రీతిలో విద్యార్థులు పాఠశాలకు హాజరు కాకపోవడంతో పాఠ్యాంశాల బోధన జరగలేదు. అత్యల్పమంది విద్యార్థులు హాజరుకావడంతో అటెండెన్స్ తీసుకొని కూర్చోబెట్టారు. ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ (సీఓఈ) విద్యాలయంలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేశారు. ఎంఈవో మహేశ్వర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రిన్సిపాల్ ఐనాల సైదులు, ఉపాధ్యాయులతో కలిసి పుస్తకాలను పంపిణీ చేశారు. ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో, మహాత్మా జ్యోతిబాపూలే, ప్రభుత్వ సాంఘిక సంక్షేమ, మైనార్టీ, టీజీఆర్ఎస్, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో విద్యార్థుల గైర్హాజరు ప్రభావం ప్రస్ఫుటంగా కనిపించింది.

విద్యార్థులు పాఠశాలకు వచ్చేలా..



విద్యార్థులకు టై, బ్యాగు, బెల్టు, షూ అందిస్తున్న ఉపాధ్యాయురాలు

మంచిర్యాలటౌన్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు, నూతనంగా చేరుతున్న విద్యార్థులను ఆకట్టుకునేలా చేసి, వారు ప్రభుత్వ పాఠశాలకు వచ్చేలా, ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ఉండేలా పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయురాలు జ్యోతి చేస్తున్న కృషిని పాఠశాల ఇన్‌చార్జి ఉపాధ్యాయురాలు సుధారాని అభినందించారు. పాఠశాలల పునఃప్రారంభం రోజున బుధవారం పాఠశాలకు వచ్చిన పిల్లలకు ప్రభుత్వం తరుపున ఉచితంగా పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, దుస్తులను ఇవ్వగా, ఉపాధ్యాయురాలు జ్యోతి ప్రతి విద్యార్థికి టై, బెల్టు, షూ, బ్యాగులను అందించారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ కమిటీ అధ్యక్షులు బాను, సభ్యులు పాల్గొన్నారు.

నీట్ విద్యార్థులకు న్యాయం చేయాలి



మాట్లాడుతున్న దీపక్‌కుమార్

బెల్లంపల్లి: నీట్ ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు తగిన న్యాయం చేయాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దీపక్‌కుమార్ బుధవారం డిమాండ్ చేశారు. బెల్లంపల్లి కాంటా చౌరస్తాలో నిరసన కార్యక్రమం నిర్వహించి ఆయన మాట్లాడారు. ఎన్‌టీఏ ప్రకటించిన నీట్ ఫలితాల్లో అక్రమాలు చోటు చేసుకోవడం దారుణమన్నారు. వైద్య విద్య చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ఈ సారి ఒకే పరీక్ష కేంద్రంలో పరీక్ష రాసిన 63మంది విద్యార్థులకు ర్యాంకులు రావడం అనుమానాలు కలుగుతున్నాయన్నారు. దీనిపై బేషరతుగా విచారణ చేపట్టి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు అన్యాయం చేయాలని చూస్తే సహించేది లేదన్నారు. అవకతవకలకు పాల్పడిన దోషులపై కఠిన చర్యలు తీసుకుని పునఃరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ శ్రేణులు పాల్గొన్నారు.

ధాన్యం డబ్బులు ఇప్పించాలని వేడుకోలు..!



దాంపూర్‌లో మాట్లాడుతున్న రైతులు

భీమారం: తాము పండించిన వరిధాన్యాన్ని వడ్ల కొనుగోలు కేంద్రాల్లో అమ్మి 20రోజులు దాటినా ప్రభుత్వం డబ్బులు చెల్లించడం లేదని బుధవారం భీమారం మండలం దాంపూర్‌లోని రైతులు ఆరోపించారు. ఈ మేరకు గ్రామంలో మాట్లాడుతూ.. వరిధాన్యం కేంద్రాల్లో అమ్మిన రెండు రోజుల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామని ప్రభుత్వం ప్రకటించి, నేడు అది అమలుచేయడం లేదని పేర్కొన్నారు. దాంపూర్ గ్రామానికి చెందిన రైతులకు చెందిన 4వేల క్వింటాళ్ల వరిదాన్యాన్ని వివిధ కేంద్రాల ద్వారా అమ్మినట్లు తెలిపారు. అయితే 20 రోజులు గడిచినా డబ్బులు రాలేదని, అధికారులను అడిగితే పెద్దపల్లి జిల్లాకి ఇక్కడి వరిధాన్యం తరలించామని, ఆ రైస్ మిల్లులకు పౌరసరఫరాల శాఖ ట్యాగింగ్ (అనుమతి) ఇవ్వలేదని అంటున్నారని రైతులు తెలిపారు. దీంతో చెల్లింపులు ఆలస్యమవుతున్నాయని అధికారులు అంటున్నారని తెలిపారు. తాము వరిధాన్యం అమ్ముకోవడం మాత్రమే తెలుసునని, అధికారులు రైతులకు డబ్బులు ఇప్పించాలే తప్పా.. ట్యాగింగ్ కాలేదని చెప్పడం ఎంతవరకు సమంజసమని రైతులు ప్రశ్నిస్తున్నారు. జిల్లా కలెక్టర్ ఇప్పటికైనా చర్యలు తీసుకొని వెంటనే వరిధాన్యం డబ్బులు ఇప్పించాలని రైతులు కోరుతున్నారు.

నేరాల నియంత్రణకు సహకరించాలి



ప్రజలతో మాట్లాడుతున్న సీఐ మోహన్

భీమారం: నేరాల నియంత్రణకు ప్రజలు సహకరించాలని శ్రీరాంపూర్ సీఐ మోహన్ కోరారు. మండలంలోని బూర్గుపల్లిలో బుధవారం పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాంలో సీఐ పాల్గొన్నారు. ప్రజల రక్షణ.. పోలీస్ బాధ్యత అని, పోలీసులకు ప్రజలు సహకరించాలని సీఐ కోరారు. గ్రామాల్లో కొత్త వ్యక్తులు షెల్టర్ తీసుకుంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. యువత చెడు మార్గాల వైపు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం యువత ఉపాధికోసం అనేక పథకాలు ప్రవేశపెడుతుందని, వాటిని ఉపయోగించుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు. ముఖ్యంగా యువకులు చెడు అలవాట్లకి బానిసలు అవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సైబర్ నేరాలు పెరిగిపోయాయని, ఈ నేపథ్యంలో సైబర్ నేరగాళ్లు చేసే ఫోన్‌కాల్స్‌కి స్పందించవద్దని కోరారు. గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, ఇందుకు పోలీస్‌శాఖ కూడా అండగా నిలుస్తుందని తెలిపారు. సీసీ కెమెరాలు ఉంటే గ్రామాలకు అవి రక్షణగా నిలుస్తాయన్నారు. కార్యక్రమంలో ఎస్సై రాములుతో పాటు ఎక్సైజ్ అధికారులతో పాటు 60మంది పోలీసులు పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు...

బూర్గుపల్లి గ్రామ పొలిమేరల్లో గల గుడుంబా స్థావరాలపై పోలీసులు దాడులు చేశారు. ఈ మేరకు గుడుంబా తయారీ చేసేందుకు ఉపయోగించే 1200 లీటర్ల బెల్లం పానకాన్ని నేలమట్టం చేశారు. 17 లీటర్ల గుడుంబాను స్వాధీన పర్చుకున్నారు.

'మిషన్ భగీరథ' సర్వే వేగవంతం చేయాలి



సూచనలిస్తున్న ఎంపీడీవో సరోజ



భీమారంలో సర్వే పరిశీలిస్తున్న ఎంపీడీవో రాధ

లక్సెట్టిపేట: గ్రామాల్లో మిషన్ భగీరథ సర్వే వేగవంతం చేయాలని ఎంపీడీవో సరోజ అన్నారు. మండలంలోని ఎల్లారం, కొత్తూరు గ్రామాల్లో గ్రామ కార్యదర్శులు నిర్వహిస్తున్న మిషన్ భగీరథ సర్వేను బుధవారం పరిశీలించారు. ఉన్నతాధికారులు ఇచ్చిన గడువులోగా సర్వే పూర్తి చేయాలని, ఇంటింటికీ వెళ్లి భగీరథ నీరు వస్తుందా లేదా.. నల్లాలు ఉన్నాయ లేదా అని పరిశీలించాలన్నారు. కార్యదర్శులకు పలు సూచనలు ఇచ్చారు. ఎంపీడీవోతో పాటు కార్యదర్శులు సుజాత, రజేశ్ ఉన్నారు.

భీమారం: మండలవ్యాప్తంగా జరుగుతున్న మిషన్ భగీరథ నీటి పంపిణీ సర్వేని బుధవారం ఎంపీడీవో రాధారాథోడ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరు విద్యాసాగర్ కలిసి తనిఖీ చేశారు. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ సరఫరా అవుతున్న నీటి నల్లాలను సర్వే యాప్ ద్వారా ఆన్‌లైన్ చేసే విధానాన్ని వారు పరిశీలించారు. ప్రతీ నల్లాని ఆన్‌లైన్ చేయాలని గ్రామ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సర్వే చేస్తున్నట్లు ఎంపీడీవో తెలిపారు. బూర్గుపల్లి పాఠశాలను సందర్శించి బడిఈడు పిల్లలను విధిగా పాఠశాలల్లో చేర్పించే బాధ్యత ఉపాధ్యాయులు తీసుకోవాలని ఆదేశించారు.

'విచారణపై పరిష్కారం వచ్చిన తర్వాతే సభ్యత్వం'

చెన్నూర్: చెన్నూర్ పెద్ద చెరువులో చేపల వేట విషయంలో ముదిరాజ్, గంగపుత్రుల మధ్య కొనసాగుతున్న సమస్యపై హైకోర్టు విచారణ సాగుతుందని, విచారణపై పరిష్కారం వచ్చిన తర్వాత ముదిరాజ్‌లకు సభ్యత్వాన్ని కల్పించే అవకాశం ఉంటుందని జిల్లా మత్స్యశాఖ అధికారి డి. సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల చెన్నూర్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామితో సమావేశం జరిగిందని తెలిపారు. విచారణ పూర్తయిన తర్వాత కోర్టు ఆదేశాల మేరకు చెరువు శిఖం ఆధారంగా సభ్యత్వం కల్పించే అవకాశం ఉంటుందని తెలిపారు.

ఎల్‌వోసీ అందజేత



దండేపల్లి: మండలంలోని మొకాశిగూడకు చెందిన కోట్నాక కిషన్ కుమారుడు అఖిల్ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతడి వైద్య ఖర్చులకు మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు రూ.2.5లక్షల ఎల్‌వోసీని బుధవారం బాలుడి తండ్రి కిషన్‌కు అందించారు.

హోటల్ యజమానులకు జరిమానా

చెన్నూర్: హోటల్ పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచడంతోపాటు నాణ్యమైన ఆహార పదర్థాలను అందించాలని మున్సిపల్ అధికారులు అన్నారు. స్థానిక హోటళ్లను బుధవారం తనిఖీ చేశారు. హయస్ బార్, రెస్టారెంట్, జీపీ మెస్‌లను తనిఖీ చేశారు. పరిసరాలు పరిశుభ్రంగా లేకపోవడంతో హయస్ బార్, రెస్టారెంట్‌కు రూ.3 వేలు, జీపీ మెస్ యజమానికి రూ.1000 జరిమానా విధించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఆర్ఐ మహ్మద్ నవీద్ అహ్మద్, ఈఈ హరికాంత్, సిబ్బంది శ్రవణ్‌కుమార్, సమ్మయ్య పాల్గొన్నారు.

మల్లె సాగులో మెలకువలు పాటించాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న సుప్రజ

తాండూర్: మల్లె సాగులో రైతులు మెలకువలు పాటించి అధిక దిగుబడులు పొందాలని బెల్లంపల్లి ఉద్యానవన శాఖ అధికారి సుప్రజ సూచించారు. మండలంలోని బోయపల్లె గ్రామంలోని మల్లె తోటలను బుధవారం ఆమె పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ సీజన్‌లో మల్లె తోటలకు బడ్‌వామ్, బ్లాసమ్ మిడ్జ్ లాంటి తెగుళ్ల సోకే ప్రమాదం ఉందన్నారు. ఉద్యానవన శాఖ అధికారుల సూచనలతో రసాయనాలు పిచికారీ చేసి నష్ట నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టి మంచి లాభాలు గడించాలన్నారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

చామనపల్లిలో మళ్లీ పోడు రగడ



వివాదాస్పద భూమిని పరిశీలిస్తున్న అధికారులు

వేమనపల్లి: చామనపల్లి శివారులో అటవీ, రెవెన్యూ భూ వివాదం మళ్లీ రాజుకుంది. సాగు భూమిలో గ్రామానికి చెందిన రైతు నూకల కిరణ్ ట్రాక్టర్‌తో దుక్కి దున్నిస్తుండగా అటవీ అధికారులు ట్రాక్టర్‌ను సీజ్ చేశారు. దీంతో గ్రామస్తులు నిరసనకు దిగగా సమస్య వివాదాస్పదంగా మారింది. నీల్వాయి ఎస్సై శ్యాంపటేల్ ఆధ్వర్యంలో అటవీ అధికారులు బుధవారం గ్రామస్తులతో చర్చలు జరిపారు. చామనపల్లి శివారు 126 కంపార్ట్‌మెంట్ అటవీ భూమిగా రికార్డుల్లో ఉంది. ఆ భూమితోపాటు పక్కన ఉన్న 67 సర్వేనంబర్ భూమి రెవెన్యూ రికార్డుల్లో ప్రభుత్వ భూమిగా ఉండగా ఆది నుంచి ఈ సమస్య వివాదానికి దారి తీసింది. ఉమ్మడి రాష్ట్రంలో ప్రస్తుత ఎమ్మెల్యే వినోద్ మంత్రిగా ఉన్నప్పుడు సుమారు 120 మందికి ఆ భూమిలో ఇందిరా భూ పంపిణీ పథకం ద్వారా పట్టాలు ఇచ్చారు. ఇందులో చాలా మంది ఏళ్ల తరబడి భూమిని సాగు చేసుకుంటున్నారు. ప్రతీ సంవత్సరం ఈ వివాదాస్పద భూమిలోకి వెళ్తున్నారనే కారణంతో అటవీ అధికారులు పలువురిపై కేసులు నమోదు చేస్తూనే ఉన్నారు. నీల్వాయి ఎఫ్ఆర్ఓ ఇక్బాల్ మాట్లాడుతూ అది అటవీ భూమి అని, ఎవరూ సాగు చేయకూడదని తెలిపారు. రెండు రోజుల్లో ఉమ్మడి సర్వే నిర్వహించి సమస్యను పరిష్కరిస్తామని నిర్ధారణకు వచ్చారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సాబీర్‌ఆలీ గ్రామస్తులకు మద్దతు తెలిపారు.

సామగ్రి అందజేత

కాసిపేట: మండలంలోని దేవాపూర్-3 అంగన్‌వాడీ కేంద్రానికి బుధవారం ఎస్‌బీ ఐ మేనేజర్ అరుణ్‌కుమార్‌దాస్ టీవీ, వాటర్‌ప్యూరిఫైర్, కుక్కర్, స్లైడ్ కుర్చీలు, ఆట వస్తువులు మొత్తం రూ.లక్ష విలువ కలిగిన వస్తువులు ఎస్‌బీఐ ఆధ్వర్యంలో అందించారు.